36

# బయటపడిన మోసం

పూర్వం మన రాష్ట్రంలో 'మర్యాద రామన్న' అనే పెద్దమనిషి ఉండేవాడు.

తెలివితేటలకు ఆయన పెట్టింది పేరు. ఎటువంటి చిక్కు సమస్యలనైనా చిటికెలో పరిష్కరించేవాడు. అందువల్ల తగవులు తీర్చుకోడానికి అనేక మంది ఆయన దగ్గరకు వస్తుండేవారు.

అదే ఊరిలో రామయ్య అనే అమాయక రైతు తీర్థయాత్రలకు వెళ్తూ తన ఆస్తినంతా అమ్మేసి, ఆ డబ్బుతో యాభై బంగారు కాసులు కొన్నాడు. ఆ బంగారాన్ని అదే ఊరిలో ఉన్న నాగయ్య అనే వ్యాపారికి దాచమని ఇచ్చి వెళ్లాడు.

నాగయ్య చాలా యుక్తి పరుడు. తెలివిగా ఎంతో మంది అమాయక ప్రజలను మోసం చేస్తుండేవాడు. అయినా... నాగయ్య ఎన్నడూ అబద్ధమాడడని నలుగురూ అనుకునేటట్లు ప్రచారం చేయించుకునేవాడు.

ఆ కాలంలో తీర్థయాత్రలకు వెళ్లిన వారు సాధారణంగా తిరిగి వచ్చేవారు కాదు. అడవుల్లో ఏ పులివాత పడడమో, దొంగల చేతిలో చావడమో, లేక- కాని చోట ఏ రోగమో వచ్చి మరణించడమో జరుగుతుండేది. అందుకనే ... 'కాశీకి వెళ్లిన వాడు, కాటికి వెళ్లిన వాడు తిరిగిరాడు' అన్న సామెత వచ్చింది.

'రామయ్య ఇంకేమి తిరిగి వస్తాడులే..!' అనుకుని అతని డబ్బును కాజేయాలని అనుకున్నాడు నాగయ్య.

అయితే... అనుకోకుండా కొన్నేళ్ళ తరువాత తిరిగి వచ్చాడు రామయ్య. నాగయ్య దగ్గరకు వెళ్లి తను దాచుకున్న బంగారాన్ని తిరిగి ఇవ్వమని అడిగాడు.

ఆ సమయానికి నాగయ్య ఎక్కడికో బయటకు వెళ్లబోతున్నాడు.



రామయ్యని చూసి ఇంట్లోకి వెళ్లి చేతికర్రతో తిరిగి వచ్చాడు.

"ఆ... ఏమి రామయ్యా బాగున్నావా?" అంటూ కుశల ప్రశ్నలు వేశాడు.

"ఆ ... బాగానే ఉన్నాను. నా బంగారు నాణాలు ఇప్పించండి!" అని అడిగాడు రామయ్య.

"అరె.., ఇప్పుడు నేను తొందరపని మీద బయటకు వెళ్తున్నాను. ఏదీ ...ఈ కర్ర కాస్త పట్టుకో- పంచె సరిచేసుకుంటాను" అంటూ తన చేతికర్రను రామయ్యకు అందించాడు నాగయ్య.

పంచె సరిచేసుకుంటూ "ఏమిటీ... బంగారు నాణాలా? నీకు తిరిగి ఇచ్చేశానుగా!" అన్నాడు.

"నాకెప్పుడిచ్చావు?" అంటూ రామయ్య గోల పెట్టినా.., "నీకు ఇచ్చేశాను పో..!" అంటూ కసిరి పంపించేశాడు నాగయ్య.

చేసేదిలేక ఆ కర్రను అక్కడ పడేసి, తన గోడును వెళ్ళబోసుకోడానికి మర్యాదరామన్న దగ్గరకి వెళ్లాడు రామయ్య.

జరిగినదంతా శ్రద్ధగా విన్నాడు మర్యాద రామన్న. వెంటనే నాగయ్యని తన దగ్గరకి రమ్మనమని కబురు చేశాడు.

నాగయ్య వెంటనే వచ్చాడు.

"ఏమి నాగయ్యా! రామయ్య బంగారు నాణాలు తిరిగి ఇచ్చేశావా?" అని అడిగాడు మర్యాద రామన్న.

"ప్రమాణం చేసి చెప్తాను" అంటూ, "రామయ్యా! కొంచెం ఈ చేతి కర్ర తీసుకో. నమస్కారం చేస్తూ ప్రమాణం చేస్తాను" అంటూ తన చేతి కర్రను రామయ్య చేతికి అందించాడు నాగయ్య.

"దేవుని మీద ప్రమాణం చేసి చెప్తున్నాను. రామయ్య బంగారు నాణాలు తిరిగి ఇచ్చేశాను. అవి నా దగ్గర లేవు" అని ప్రమాణం చేశాడు నాగయ్య.

అది విని నివ్వెరబోయాడు రామయ్య.

"నువ్వింక వెళ్లవచ్చు" అన్నాడు నాగయ్యతో మర్యాదరామన్న.

"చిత్తం..!" అంటూ తన చేతి కర్రను తిరిగి తీసుకోబోయాడు నాగయ్య.

"ఇచ్చేసిన దానిని మళ్ళీ ఎలా తీసుకుంటావు నాగయ్యా?" అంటూ కొంటెగా నవ్వాడు మర్యాదరామన్న.

అది విని కొయ్యబారిపోయాడు నాగయ్య.

"రామయ్యా! నీ చేతిలోని కర్రను మధ్యకు విరువు" అన్నాడు మర్యాదరామన్న.

అలాగే కర్రను రెండుగా విరిచాడు రామయ్య. అందులోనుంచి గల గల లాడుతూ యాభై బంగారు నాణాలు క్రిందపడ్డాయి.

"రామయ్యా! నీ సొమ్ము తీసుకుని నువ్వెళ్లు" అన్నాడు మర్యాదరామన్న.

తను చేసిన మోసాన్ని ఒప్పుకుని క్షమించమని వేడుకున్నాడు నాగయ్య.

"ఇంకెప్పుడూ తప్పుడు పనులు చేయకు, ఇతరులను మోసగించకు!" అని చివాట్లు పెట్టి నాగయ్యని పంపించేశాడు మర్యాదరామన్న.

'తాను డబ్బు తిరిగి ఇచ్చినట్లూ అవుతుంది .., అబద్ధం చెప్పనట్లూ ఉంటుంది.., రామయ్య డబ్బు తనకు దక్కుతుంది'... ఈ ఉద్దేశంతో ఆ బంగారు నాణాలను కర్రలో దాచి, ఆ కర్రను రామయ్య చేతికిచ్చి ఇంతటి నాటకం ఆడాడు నాగయ్య.

అయితే... కర్ర వ్యవహారాన్ని మొదటినుంచీ గమనించిన మర్యాదరామన్న ఆ మోసాన్ని ఇట్టే గ్రహించాడు.

కొందర్ని కొంతకాలం మోసం చేయవచ్చు కాని .., అందర్నీ ఎల్లకాలం మోసం చేయలేరు కదా!

★★★

